ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 14.06.2024 సమయం 13:10 గంటలు

ముఖ్యాంశాలు

1. రక్తదానం పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలని , అపోహలను వీడాలని మంత్రి పొన్న ప్రభాకర్ కోరారు. పెరుగుతున్న అవసరాలు దృష్ట్యా రాష్ట్రంలో వంద పడకలు ఉన్న ప్రతి ఆసుపత్రికి ఒక బ్లడ్ బ్యాంక్ ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

2. ప్రభుత్వం రైతు రుణ మాఫీపై త్వరలోనే క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. రుణమాఫీ కాగానే బ్యాంకులకు రైతు బకాయలు జమ అవుతాయని చెప్పారు.

3. కాళేశ్వరంపై న్యాయ విచారణ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు. త్వరలోనే ఆర్థికాంశాలపై విచారణ ప్రారంభిస్తామన్నారు.

4. ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన ప్రాతిపదికగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలు నిర్ణయంపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. రుణమాఫీ అందరికీ వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**రక్త దాన దినోత్సవం-పొన్నం ప్రభాకర్**

రక్తదానం పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలని, అపోహలను వీడాలని రాష్ట్ర రవాణ శాఖ, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పెరుగుతున్న అవసరాలు , కొత్త జిల్లాల ఏర్పాటు లాంటి కారణాలతో వంద పడకలు ఉన్న ప్రతి ఆసుపత్రికి ఒక బ్లడ్ బ్యాంక్

ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు , అవగాహన సదస్సులు జరుగుతున్నాయి. రాజ్ భవన్ , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త అధ్వర్యంలో 20వ రక్త దాతల దినోత్సవం సందర్భంగా , రాజ్ భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో రాక్తదాన శిబిరం ఏర్పాటయింది. రక్తదానం పట్ల అవగాహన పెంచుతున్న సంస్థలు , దాతలను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ రక్తదాన శిబిరాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెడ్ క్రాస్ వాహనాలకు రవాణా శాఖ తరుపున పన్నులు మినహాయించే విషయమై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. తలసేమియా వ్యాధి గ్రస్తులకు బస్ పాస్ ఇవ్వాలని పలు సంస్థలు కోరుతున్నాయని , ఈ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు. అరుదైన బ్లడ్ గ్రూపు ఉన్న వారి సమాచారం రెడ్ క్రాస్ సొసైటీ దగ్గర ఉండాలని ఈ దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా, రాజ్ భవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ,హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చాంగ్తూ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

(MSL)

**వనపర్తి- చిన్నారెడ్డి**

ప్రభుత్వం రైతు రుణ మాఫీపై త్వరలోనే క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. రుణమాఫీ కాగానే బ్యాంకులకు రైతు బకాయలు జమ అవుతాయని చెప్పారు. వనపర్తి జిల్లాలో ఆహార శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకులు రైతులకు సరిపడ రుణాలు అందించి ప్రోత్సహించాలని చిన్నారెడ్డి అధికారులకు సూచించారు. నిన్న రాత్రి కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన బ్యాంకర్ల జిల్లా స్థాయి కమిటీ , సంప్రదింపులు, సమీక్షా సమావేశం నిర్వహించారు. లీడ్ బ్యాంక్ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 4 వేల 361 పైచిలుకు కోట్ల వార్షిక రుణ ప్రణాళికకు కమిటీ ఆమోదించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి

మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకర్లు తమవంతు సహకారం అందించి జిల్లా అభివృద్ధిలో అన్ని బ్యాంకులు సమానంగా భాగస్వాములు కావాలని సూచించారు .
(పిటిసి వనపర్తి జిల్లా)

కాళేశ్వరం-విచారణ

కాళేశ్వరంపై న్యాయ విచారణ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు. త్వరలోనే ఆర్థికాంశాలపై విచారణ చేపడతామని అన్నారు. ఎవరివద్దనైనా సమాచారం ఉంటే కమిషన్‌కు అందజేయాలని సూచించారు. విచారణలో భాగంగా ఈరోజు ఈఎన్ సీ కార్యాలయం , ఓ అండ్ ఎం విభాగాల ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది. మేడిగడ్డ , అన్నారం, సుందిళ్ల ఆనకట్టల అంశంపై వివరాలను సేకరించనుంది.

(డెస్క్)

**కొడంగల్-గురుకులం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం 25 కోట్ల రూపాయాలతో పరిపాలన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది. అదేవిధంగా , కొడంగల్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో అదనపు వసతుల కల్పనకు 23.45 కోట్ల రూపాయలు, బొమ్రాస్‌పేట మండలం బుర్హాన్‌పూర్‌లోని ఎంజేపీ బీసీ బాలికల పాఠశాల , కళాశాల నిర్మాణానికి 25 కోట్ల రూపాయాలతో పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్రా వెంకటేశం పేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

(డెస్క్)

కవిత-కేటీఆర్ ములాఖత్

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యకుడు కె. తారక రామారావు ఈ రోజు ములాఖత్ అయ్యారు. తన సోదరి కవితతో మాట్లాడి , యోగ క్షేమాలు తెలుసుకున్న తర్వాత తారక రామారావు హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. ఢిల్లీ మద్యం కేసులో కవితకు జ్యుడీషియల్ రిమాండ్‌ను ఈ నెల 21 వరకు పొడిగిస్తూ కోర్టు ఇది వరకే ఉత్తర్వులు ఇచ్చింది. మద్యం కేసులో కవిత పాత్రపై కేంద్ర దర్యాప్తు సంస్థ- సీబీఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేయగా , పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణను జులై 6న చేపడతామని స్పష్టం చేసింది.

(డెస్క్)

మిషన్ భగీరథ-సిరిసిల్ల

మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీటి సరఫరా విషయంలో 11 అంశాలపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికార యంత్రాంగం ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో సర్వే చేసి సమస్యలు తెలుసుకోవడమే కాకుండా కేంద్ర జలశక్తి శాఖ నుంచి నిధుల మంజూరు కోసం కూడా ఈ సర్వే చేస్తున్నారు. పది రోజుల పాటు జరిగే సర్వేలో పంచాయతీరాజ్ సిబ్బంది, కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యేక యాప్ ద్వారా లబ్ధిదారుడి వివరాలు నమోదు చేస్తున్నారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

గుడ్డెందొడ్డి రిజర్వాయర్

జోగులాంభ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గం పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గుడ్డెందొడ్డి రిజర్వాయర్ నుంచి జెడ్పి చైర్ పర్సన్ , కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరితమ్మ

నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సరితమ్మ గుడ్డెందొడ్డి ర్యాలంపాడుతో పాటు ఆరు రిజర్వాయర్లు సాగునీటితో నింపి సాగుకు అందిస్తామన్నారు. రైతుల సంక్షేమ కోసం పని చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

(PTC జోగులాంభ గద్వాల జిల్లా)

**వరంగల్- బక్రీద్ ఏర్పాట్లు**

ఈనెల 17 న బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వరంగల్ అదనపు కలెక్టర్ జీ. సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. బక్రీద్ నేపథ్యంలో ముస్లిం మతపెద్దలు , మున్సిపల్, పంచాయతీ, పోలీస్ అధికారులతో సమావేశ మందిరంలో ఈ రోజు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మసీదులు, ఈద్గా, కబ్రిస్తాలో శానిటైజేషన్, మౌలిక వసతుల కల్పనతో పాటు తగినంత లైటింగ్, పటిష్ట పారిశుద్ధ్యం పనులు చేయాలని అధికారులకు సూచించారు.

(వరంగల్ జిల్లా పీ టీ సీ)

**మహబూబాబాద్ –కలెక్టర్**

మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో అధికారులు, ముస్లిం మతపెద్దలతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పండగ కోసం మున్సిపల్ కమిషనర్ల పరిధిలోని ఈద్గాల వద్ద శానిటైజేషన్ , లైటింగ్, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

(మహబూబాబాద్ జిల్లా, పి.టి.సి)

కామారెడ్డి-బక్రీద్

మత సామరస్యానికి ప్రతీక కామారెడ్డి జిల్లా అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రార్థన స్థలాలు, వధశాలల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని మునిసిపల్ కమిషనర్లను , జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. నిబంధనలకు లోబడి పశువుల రవాణా జరిగేలా చూడాలన్నారు.

(పీటీసీ, సిరిసిల్ల)

రుణమాఫీ-నిరంజన్ రెడ్డి

ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన - PMKSY ప్రాతిపదికగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలు నిర్ణయంపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు. రుణమాఫీ అందరికీ వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వ ఆంక్షలను తప్పుపట్టారు. రాష్ట్రంలో 70 లక్షల మందికిపైగా రైతులు ఉండగా , కేంద్రం గరిష్టంగా 36.1 లక్షల మంది రైతులకే అమలు చేసిందని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చామని చెప్పారు. ఇందులో భాగంగా 11 విడుతల్లో రైతుల ఖాతాల్లో 72 వేల 910 కోట్ల రూపాయలు జమచేశామని గుర్తు చేసారు. వ్యవసాయ రంగాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు.

(డెస్క్)